

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ఆరుగంటలకొకసారి జ్వరం చూసి,  పుస్తకం లో వేసుకుంటున్న పేజీవైపు చూస్తూ కూర్చుంది మౌనంగా.

నెమ్మదిగా తిరుగుతున్న ఫాన్, ఆ చిన్నగాలికి స్వప్నిక నుదిటిమీద అల్లిబిల్లిగా ఆడుతున్న ముంగురులు.

ఈ రెండూ తప్ప ఎక్కడా కదలిక లేదు ఆ గదిలో.

మెత్తగా ఊపిరి వదులుతూ,  ప్రశాంతంగా నిద్రపోతున్న కూతురి మీద చెయ్యి వేసి వెనక్కి వాలింది.

డాక్టర్ రాజేష్ చెప్పినట్టుగా సమయానికి మందులు వేస్తూ,  జ్వరం రికార్డ్ చేస్తూ ఉండడంలో రెండు రోజులు గడిచిపోయాయి. మందు వేసినప్పుడు కాస్త తగ్గడం, మళ్ళీ అంతలోనే పెరగడం. ఇలా దోబూచులాడింది జ్వరం.

జ్వరం మాట పక్కన పెడితే, చూస్తుండగా పిల్ల విపరీతంగా నీరసపడిపోవడంతో రాధిక కంగారు పడసాగింది.

ఏం పెట్టినా తినాలని లేదనడం, అతి కష్టమ్మీద ఓ రెండు ముద్దలో, ఒక చిన్న చపాతీ ముక్కో తినడం, పక్కన పెట్టేయడం. ఇలాగే సాగింది.

మరో మూడు రోజులు స్కూల్ మిస్ అవడం స్వప్నికకి అస్సలు ఇష్టం లేదు.

" ఇన్ని రోజులు జ్వరం ఏమిటమ్మా? నేను బేబీగా ఉన్నప్పటినించీ ఎప్పుడూ రాలేదు. ఇన్ని రోజులు స్కూల్ కి  వెళ్ళకపోతే ఎంత మిస్ అవుతానో తెలుసా? రేపు ఏమైనా సరే నేను స్కూల్ కి వెళ్ళిపోతాను" అంది.

"చూద్దాం నాన్నా, తగ్గితే తప్పకుండా వెళుదువుగాని" అంటూ కాలింగ్ బెల్ మోగితే ఎవరో చూద్దామని తలుపు తియ్యడానికి వెళ్ళింది రాధిక.

" అరే, సీమా! నువ్వా? దా, దా, ఎలా ఉన్నావమ్మా?" అంటూ సీమని చెయ్యి పట్టుకుని ఆప్యాయంగా పలకరించింది.

" ఆల్ గుడ్ ఆంటీ,మీరు ఎలా ఉన్నారు? స్వప్ని ఏది? ఎలా ఉంది దానికి ఇప్పుడు? జ్వరం తగ్గిందా?" అంటూ గబ గబా అడిగింది.

" పరవాలేదు, తగ్గుతోంది" అంది

" ఎవరూ, సీమా? రావే. ఎలా ఉన్నావు?, దా, నా దగ్గరకి" స్వప్నికూర్చున చోటినించే గట్టిగా అరిచినట్టు అడిగింది.

" వస్తున్నా తల్లీ, చెప్పులు విప్పుకోనీ, అంటూ స్కూల్ బూట్లు,సాక్సులు తీసి జాగ్రత్తగా ఒక పక్కన పెట్టి లోపలకి వచ్చింది.

ఇద్దరి నవ్వుముఖాలు చింకిచాటల్లా విశాలమయ్యాయి.

వస్తూనే స్వప్ని పక్కన కూర్చుని..

"ఎలా ఉన్నావే?  జ్వరం తగ్గుతోంది అని ఆంటీ చెప్పారు. వెరీ గుడ్. మహా అయితే మరో రోజు రెస్ట్ తీసుకుంటే చాలు" అంది స్వపివైపు చూస్తూ.

" అదే, అంటున్నా అమ్మతోటి. ఎంత మిస్ అయిపోతున్నానో స్కూల్ ని" అంటూ కబుర్లు మొదలుపెట్టింది స్వప్నిక.

టీచర్లు, తమ స్నేహితులు అడుగుతున్నారని, క్లాస్ టీచర్ వసంతా మిస్ అయితే మరీ మరీ గుర్తు చేసుకుంటున్నారని, ఏపాఠాలు చెప్పారు, అందరూ లంచ్ కి ఏం తెచ్చుకున్నారు? ఇలా స్కూల్ విశేషాలన్నీ చెప్తోంది సీమ.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టుగా " ఉండు, ఒక్క నిమిషం" అంటూ తన స్కూల్ బేగ్ లోంచి ఒక పెద్ద పేపర్ కవర్ తీసి అందులోంచి కాగితాలు తీసి ఇచ్చింది.

" నోట్స్  కాపీలు. నాన్నకి చెప్పి నా నోట్స్ అంతా ఫోటో కాపీ చేయించాను . వసంతా మిస్ తో చెప్పానులే , అన్నీ రాసుకోవడానికి చాలా టైం పడుతుంది కదా స్వప్నిక కి, అందుకని ఇలా ఇస్తాను. లేకపోతే నోట్స్ విషయం లో మిస్ ఎంత స్ట్రిక్టో నీకు తెలుసుకదా.

ఒకసారి రాసినది పదిసార్లు చదివినదానికి సమానం అంటారు కదా! ఈ సారికి వీటిని అనుమతించమని చెప్తే 'సరే' అన్నారు. నైస్ ఆఫ్ హర్" అంది కాగితాలు స్వప్నిక కి ఇస్తూ.

" నైస్ ఆఫ్ యూ తల్లీ" అంది రాధిక ఇద్దరికీ పాలు, బిస్కట్లు తెచ్చి ఇస్తూ.

" నోట్స్ లన్నీ కాపీ చేసుకుని తెచ్చుకోవాలేమో రేపెప్పుడైనా! అని నిన్ననే అన్నాను మీ అంకుల్ తో. నువ్విలా తెచ్చి ఎంత మంచి పని చేశావో" అంది ఆప్యాయంగా.

"పరవాలేదాంటీ, అమ్మ చెప్పింది ఈ ఆలోచన" అంది సీమ. నవ్వింది రాధిక.

గల గలా కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళిద్దర్నీ వదిలి, వంట ప్రయత్నంలో పడింది రాధిక.

" బాగా తగ్గిపోతే రేపు, లేదంటే ఎల్లుండి వచ్చేయ్ స్కూల్ కి. నువ్వు లేకపోతే బోర్ కొడుతోంది స్కూల్ కూడా. ఇంక రన్నింగ్ ప్రాక్టీస్ అయితే చెప్పనే అక్కర్లేదు" అంది .

"ఇంక నేను వెళ్తానే మరి" అంటూ స్వప్నికి, బయలుదేరతాను ఆంటీ" అంటూ రాధికకి చెప్పి లేచింది సీమ.

"యస్" అంటూ బొటనవేలు పైకెత్తి చూపింది స్వప్నిక

" హలో సీమ అక్కా" ఇంట్లోకి దూసుకు వచ్చిన సాహిల్ అన్నాడు గట్టిగా

" హలో సాహిల్, అయిపోయిందా ప్లే టైం" బదులుగా అంది సీమ.

"హా, వివాన్ వాళ్ళు మూవీకి వెళ్తున్నారుట, త్వరగా వెళ్ళిపోయాడు. రాహుల్ రాలేదు ఈరోజు.నేను హర్ష ఇద్దరమే ఏం ఆడుకుంటాం? అందుకే వచ్చేశా." అని సీమకి బదులిచ్చి

హాయ్ అక్కలూ, హౌ ఆర్ యూ?" అంటూ స్వప్నికని అడిగాడు.

" గుడ్ రా" అంది స్వప్నిక నెమ్మదిగా.

"రండి అయితే ముగ్గురం స్క్రాబిల్ ఆడుకుందాం" అన్నాడు హుషారుగా.

" స్కూల్ నించి ఇటే వచ్చాను రా, రేపెప్పుడైనా మళ్ళీ వస్తానుగా, లేట్ అయితే మమ్మీ కంగారు పడుతుంది" అంది సీమ.

"సీమా అక్కా, ప్లీజ్" అన్నాడు

" నేను అమ్మకి ఫోన్ చేసి చెప్తాలే సీమా, ముగ్గురూ ఆడుకుని, తొందరగా రాత్రి భోజనం చేసి వెళుదువుగాని. మీ అంకుల్ రాగానే దింపేస్తారు. హోం వర్క్ ఎక్కువగా లేకపోతేనే" అంది రాధిక.

" వర్క్ ఎక్కువ లేదు ఆంటీ, సరేలెండి" అంది సీమ.

" అయితే నా డ్రెస్ వేసుకో స్కూల్ డ్రెస్ మార్చుకుని" అంది స్వప్నిక ఉత్సాహంగా.

రాధిక సీమ వాళ్ళ అమ్మకి ఫోన్ చేసి చెప్పింది.

ఒకరింట్లో ఒకరు రాత్రి పూట ఉండడం, కలిసి చదువుకోవడం అలవాటే వారిద్దరికీ. వెంటనే ముఖం కడుక్కుని, స్వప్నిక డ్రెస్ వేసుకున్నాకా, ముగ్గురూ ఆటలో పడ్డారు.

రాత్రి ఏడవుతుండగా ఇంటికి వచ్చిన కిరణ్ ఆడుతూ, హుషారుగా కనిపిస్తున్న స్వప్నిక ని చూసి సంతోషపడ్డాడు.

పక్కన వచ్చి కూర్చుని " ఎలా ఉన్నావురా కన్నమ్మా?" అని అడిగాడు ప్రేమగా.

" బావున్నాను కదా నాన్నా, చూడు. జ్వరం కూడా తగ్గిపోయినట్టే ఉంది. రేపు స్కూల్ కి వెళ్ళచ్చు కూడా" అంది చిన్నగా నవ్వుతూ.

" వెరీ గుడ్" అన్నాడు కిరణ్.

" ఏడున్నర అవుతోంది. భోజనాలు చేసేస్తారా? అవగానే నాన్న వెళ్ళి సీమని దింపేసి వస్తారు మరీ లేట్ అవకుండా" అంది రాధిక.

ముగ్గురూ తలలూపారు.

" అలూ పరాటాలా? నా ఫేవరెట్, బోల్డంత బటర్ తో తింటే సూపర్ యమ్మీ" అంటూ చెప్పేశాడు సాహిల్.

" అదే, ఇలాగే బోల్డంత బటర్ తో తింటూ ఉండు, బాల భీముడిలా తయారవుతావు. ఇప్పటికే ఎలా ఉన్నావో చూడు ! బూరె బుగ్గలు నువ్వూ" అంది తమ్ముడిని చూస్తూ స్వప్ని.

" అమ్మా, చూడమ్మా, అక్క" అంటూ ఫిర్యాదు చేశాడు.

వాళ్ళిద్దరినీ చూసి నవ్వింది సీమ.

" ష్, మాట్లాడకుండా గబ గబా తినండి. ఎవరు ఫస్ట్ తింటే వాళ్ళు నాన్నతో పాటు కార్ లో వెళ్ళి సీమ అక్కని దించి రావచ్చు" అంది రాధిక.

కిరణ్ స్నేహితుడి దగ్గర సెకండ్ హాండ్ కార్ తీసుకున్నాకా, వాళ్ళకి హాయిగా ఉంది. నలుగురూ ఒకేసారి ఇబ్బంది లేకుండా వెళ్ళడానికి, తమ స్వంత ఊరు వెళ్ళడానికి.

" యెస్, అలా అయితే నేనే" అంటూ సాహిల్ తినడం మొదలుపెట్టాడు.

అది సాహిల్ ని ఉద్దేశించి అన్నదే అని ఆడపిల్లలిద్దరికీ తెలుసు. అందుకే నవ్వారు వాళ్ళిద్దరూ.

"అన్నట్టు మర్చిపోయాను, తాతగారు చిన్న కాఫ్ ది ఫోటో పంపించారు. ఎంత ముద్దుగా ఉందో చిన్న దూడ, చూడండి" అంటూ ఫోన్ లో ఫోటో చూపించింది పిల్లలు ముగ్గురికీ.

తెల్లగా ముద్దొస్తున్న ఆ దూడ ఫోటోని ఒకరి తర్వాత ఒకరు చూశారు ముగ్గురూ.

" భలే ముద్దుగా ఉంది కదమ్మా" అన్నాడు సాహిల్.

" అవును, మనం అక్కకి జ్వరం తగ్గగానే వెళ్ళి చూసి వద్దాం" అంది రాధిక.

"యస్, సీమక్కా, నువ్వు కూడా వస్తావా?" అన్నాడు సాహిల్

"ఓకే" అంది సీమ ఉత్సాహంగా

'ఆకలి లేదని, తినాలని లేదని, ఇలా ఏదో ఒకటి చెప్తూ ఒక పరాఠా కూడా తినలేకపోయింది స్వప్నిక. రాధిక బలవంతం చేసినా ఏమీ ప్రయోజనం లేకపోయింది.

"అమ్మా, నేను రెడీ. చూడు చెయ్యి కూడా ఎంత శుభ్రంగా కడుక్కున్నానో, చూడు సోప్ వాసన" అంటూ తన చేతిని రాధిక ముక్కుదగ్గర ఉంచి మరీ చెప్పాడు సాహిల్.

వాడిని చూసి సీమ పక పకా నవ్వింది.

" ఎంత క్యూట్ గా ఉంటాడో వీడు, నాకిలాంటి తమ్ముడుంటే ఎంత బావుండునో? అనిపిస్తుంది నాకు వీడినెప్పుడు చూసినా, వాడి బుగ్గలు సున్నితంగా తాకుతూ " అంది.

" ఇలా వెనకపడి సతాయించే తమ్ముడు కాక, మీ అన్నలా బాగా చూసుకునే అన్న ఉంటే ఎంత బావుంటుందో? అనిపిస్తుంది నాకు శరత్ అన్నని చూసినప్పుడల్లా" అంది స్వప్నిక.

అయితే బ్రదర్స్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం ఏదైనా పెడతారా కొంపదీసి" అన్నాడు సాహిల్

అందరూ నవ్వారా మాటలకి.

సీమ ని దింపి వస్తామని వెళ్ళారు కిరణ్, సాహిల్.

కొద్దిగా పాలు మాత్రం తాగింది స్వప్ని.

" అమ్మా, ఒకసారి ఇలా రావా?" పడుకునే ముందు బ్రష్ చేసుకోవడానికి వెళ్ళిన స్వప్నిక బాత్రూం లోంచి పిలిచింది.

" ఏమయింది స్వప్ని?" అంటూ వచ్చింది రాధిక.

" నా నోట్లో బ్లడ్ అమ్మా, రక్తం.. బ్రష్ కి చూడు" అంది భయంగా.

రాధిక తృళ్ళిపడింది. ఆమె బ్రష్ కున్న తెల్లటి కుంచెలకి ఎర్రగా అంటిన రక్తం.

" ఏదీ చూడనీ" అంటూ నోరు తెరిచి చూపమంది.

చిగుళ్ళలోంచి కొద్దిగా రక్తం వస్తోంది. భయం వేసినా తమాయించుకుని

" బ్రష్ తోనో, మరేదైనా కొట్టుకున్నావేమోరా" తగ్గిపోతుంది లే, నొప్పిగా ఉందా, ఐస్ పెడతాను ఉండు" అని నోరు శుభ్రంగా కడుక్కోమని, స్వప్నిక ని తీసుకుని వచ్చి ఫ్రిజ్ లోని ఐస్ గడ్డలు రెండింటిని తెచ్చి చిగుళ్ళ మీద, పళ్ళ మీద మెల్లగా రాయడం మొదలు పెట్టింది.

తన ఒళ్ళో వాలిన స్వప్నిక ముక్కు చివర్ల కూడా కొద్దిగా ఎర్రగా కనిపించేసరికి రాధికకి చాలా భయం వేసింది. అక్కడ కూడా రక్తం ఉంది.

చేత్తో రుద్దుకుంటే నోటిలోనిది అక్కడ అంటిందో, అక్కడ కూడా వస్తోందో, ఏమీ అర్థం కాలేదు రాధిక కి.

తడి రుమాలుతో ముఖమంతా తుడిచి, అక్కడ కూడా ఐస్ తో మెల్లగా రుద్దడం మొదలుపెట్టింది.

అంతకంటే ఏం చేయాలో తెలియలేదు ఆమెకి. కిరణ్ వాళ్ళు త్వరగా వస్తే బావుండును అనుకోసాగింది.

ఎందుకో స్వప్నిక ముఖం తెల్లటి ట్యూబ్లైట్ వెలుగులో మరింత తెల్లగా పాలిపోయినట్టుగా అనిపించింది మొదటిసారి.

ఐస్ వల్లనో, ఆమె పడుకున్న భంగిమ వల్లనో కాసేపటికే రక్తం రావడం తగ్గింది. రాధిక కొద్దిగా కుదుటపడింది.

కిరణ్ ఇంటికి రాగానే సాహిల్ కి, వినబడకుండా విషయం చెప్పింది.

రక్తం అన్న మాట వినగానే కిరణ్ కూడా కంగారు పడ్డాడు.

"ప్రస్తుతానికి తగ్గింది కదా, రేపు పొద్దున్నే డాక్టర్ రాజేష్ దగ్గరకి వెళ్ళి విషయం చెబ్దాం. ఇప్పుడు ఎనిమిది దాటింది కదా, క్లినిక్ మూసేసి ఉంటారు" అన్నాడు కిరణ్.

చేసేదేమీ లేక 'సరే' అంది రాధిక.

అర్ధరాత్రి దాటినా ఇద్దరికీ నిద్ర రాలేదు.

ముందుగదిలోనే కూర్చుని కొద్దిసేపు మాటల్లోనూ, మరికొద్దిసేపు ఆలోచనల్లోనూ గడిపారు.

ఇదీ అని చెప్పలేని భయం ఇద్దరిలోనూ ఒకేరకంగా ఉంది.

ఒకరికొకరు చెప్పుకుంటున్న ధైర్యం లా మధ్య మధ్యన మౌనం.

రెండు గంటలు దాటుతుండగా కిరణే అన్నాడు.

" పడుకో రాధికా, బెంగ పెట్టుకుంటే వచ్చేదేముంది? తెల్లవారుతూనే డాక్టర్ దగ్గరకి తీసుకెళదాం. టెస్ట్ లు చేయిస్తారేమో కనుక్కుందాం. అసలు విషయం తెలిస్తే అప్పుడు ఆయనే చెప్తారు కదా" అన్నాడు.

మౌనంగా తల ఊపింది రాధిక, కళ్ళల్లో నీళ్ళని కొంగుతో తుడుచుకుంటూ.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments